నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: నాచారం 11కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10.30 నుంచి 12.30 వరకు హబ్సిగూడ వీధి నంబర్-1 నుంచి 3 వరకు హరిజనబస్తీ, పీఅండ్‌టీ కాలనీ, కాకతీయనగర్ పార్కు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రామిరెడ్డి తెలిపారు.

వైజయంతి ఫీడర్ పరిధిలో..

మల్లాపూర్: 11కేవీ వైజయంతి ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. కౌండిన్యనగర్, వైజయంతి థియేటర్ ప్రధాన రహదారి, రవీంద్రనగర్ కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మల్లిఖార్జున్‌నగర్ ఫీడర్ పరిధిలో..

బోడుప్పల్: మల్లిఖార్జున్‌నగర్ ఫీడర్ పరిధిలోని పలు కాలనీల్లో బుధవారం విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు చిలుకానగర్, మార్కండేయ టెంపుల్, మల్లిఖార్జున్‌నగర్, రాంనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు అయ్యప్ప టెంపుల్ రోడ్డు, ఈస్ట్‌బాలాజీ హిల్స్, శ్రీనివాస్ కాలనీ, పద్మావతి కాలనీ, రాజశేఖర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో..

ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆంజనేయనగర్, గాయత్రీనగర్, ద్వారకానగర్, బుడగ జంగాల కాలనీ, కేశవనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బృందావన్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, సాయి మారుతీనగర్, ఆకృతి టౌన్‌షిప్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బీరప్ప దేవాలయం అభివృద్ధికి కృషిచేస్తా



చిగుళ్ల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దేవాలయం కమిటీ సభ్యులు

మల్లాపూర్: బీరప్ప మహంకాళి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని దేవాలయం చైర్మన్ చిగుళ్ల శ్రీనివాస్ కురుమ అన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మంగళవారం గుడి కమిటీ సభ్యులు శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మల్లాపూర్ కురుమ సంఘం అధ్యక్షుడు బెల్లం బక్కయ్య కురుమ, వైస్ చైర్మన్ సీతాల వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి చౌదరిపల్లి పర్వతాలు కురుమ, గ్రామ కమిటీ వైస్ చైర్మన్ కంది రాములు, ప్రధాన కార్యదర్శి బొడ్డు నాగమల్లయ్య, కోశాధికారి బండి లింగం కురుమ తదితరులు ఉన్నారు.

త్వరలో నూతన ఆలయ కమిటీలు

కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి



ఆలయ షెడ్డుకు భూమిపూజ చేస్తూ..

రామంతాపూర్: కేసీఆర్ నగర్‌లోని బీరప్ప దేవాలయానికి సొంత నిధులతో నిర్మించే షెడ్డు పనులను మంగళవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఎండోమెంట్ పరిధిలో ఉన్న అన్ని దేవాలయాలకు త్వరలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని, విషయాన్ని దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి కూడా తెచ్చామని, అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో రేవు కృష్ణయ్య, తోఫిక్, సర్వే మురళీగౌడ్, సాగర్, రవీందర్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూజా స్టోర్‌లో అగ్నిప్రమాదం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని పూజా స్టోర్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆనంద్‌బాగ్ క్రాస్ రోడ్స్‌లో కేశవ దేవరాయ మణికంఠ కోకొనట్, పూజా సామగ్రి దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగానే రాత్రి స్టోర్‌కు తాళం వేసి వెళ్లారు. అర్ధరాత్రి పొగలు వస్తుండంతో స్థానికులు 100కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్ మంటలార్పింది. అప్పటికే స్టోర్‌లో ఉన్న సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన పైఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. ప్రమాద స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్, సర్కిల్ ఉప కమిషనర్ జి.రాజు పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: చిన్న పరిశ్రమల యాజమానుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేయనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం చిన్నతరహా పరిశ్రమల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీకి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్.అలెగ్జాండర్, ఆదినారాయణ, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలు లేకుండా చూడాలి



అల్వాల్: ఎంఈఎస్ కాలనీ కిష్టమ్మ ఎన్‌క్లేవ్ వద్ద కొన్ని రోజులుగా 1100 డయా వాటర్ పైపులైన్ లీకేజీ అవుతోందని కాలనీవాసులు కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె వాటర్ వర్క్ అధికారులకు తెలియజేసి పైపులైన్ లీకేజీ లేకుండా చూశారు. డివిజన్ పరిధిలో నీటి లీకేజీలు కాకుండా చూడాలని ఆమె అధికారులకు సూచించారు. వాటర్ వర్క్స్ అధికారి బిక్కులాల్, నాయకులు మల్లేష్‌గౌడ్, వీఎస్.రాజు, ప్రేమ్‌కుఆమర్, గిరి కాలనీవాసులు పాల్గొన్నారు.

కోడ్ కూయకముందే..

టార్గెట్ చేరాల్సిందే..

బోడుప్పల్‌లో రూ.30 కోట్లతో.. 180 పనులకు శ్రీకారం

- రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అధిక ప్రాధాన్యం
- సగం పనులు పూర్తి.. ప్రాసెస్‌లో మిగిలిన సగం పనులు
- ఎంపీ ఎన్నికల కోడ్ నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు



హరితహారంలో మొక్కలు నాటుతున్న మేయర్, కమిషనర్ (ఫైల్)

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో గడిచిన ఆరు మాసాల్లో రూ.30 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు, పాలకవర్గం శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. వీటితో పాటు అత్యవసర పనులు చేపట్టనున్నారు. మొత్తం 180 పనులకు తీర్మానం చేయగా వాటిలో సగం పనులను పూర్తి చేశారు. మిగతా సగం పనులను కూడా రానున్న పార్లమెంట్ ఎన్నికల కోడ్ నాటికి పూర్తి చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ పనుల్లో ముఖ్యంగా చిలుకానగర్, చెంగిచర్ల, బొల్లిగూడ ప్రధాన రహదారులు ఉన్నాయి.

త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు..

బోడుప్పల్‌లో గడిచిన ఆరు మాసాల్లో మౌలిక వసతులైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రధాన రహదారులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో తీర్మానం చేసిన 180 పనుల్లో అత్యధిక శాతం ఈ రెండు పనులే ఉన్నాయి. 50 పనులు పూర్తి చేయగా, మరో 56 పనులకు వేగవంతంగా పనులు జరుగుతున్నాయి. మరో 31 పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి. మిగిలిన 43 పనులకు టెండర్ పెట్టగా ఎవరూ హాజరు కాలేదు. దీంతో 43 పనులకు మళ్లీ టెండర్ రీకాల్ చేయాల్సి ఉంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల కోడ్ నాటికి పనులన్నింటినీ పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

డ్రైనేజీ, రోడ్డు పనులకు అధిక ప్రాధాన్యం

ఇటీవల చేపట్టిన పనుల్లో అత్యధిక శాతం రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులే ఉన్నాయి. తొలుత నగర పాలక సంస్థలో దశలవారీగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టేందుకు అధికారులు, పాలకవర్గం ముందుకు వచ్చింది. డ్రైనేజీ పనులు పూర్తయిన చోట ప్రయారిటీ ప్రకారం రోడ్లు వేయనున్నారు. రానున్న మరో రెండు మాసాల్లో నగర పాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారులను వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని పనులకు తీర్మానం చేసి టెండర్ పనులు పూర్తి కాగా ఆ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు..



నగర పాలక సంస్థ పరిధిలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తూ, ఇతర అత్యవసర పనులను చేపడుతున్నాం. పార్కులు, వనాలు, నర్సరీలను అభివృద్ధి చేసి పచ్చదనం పెంపొందిస్తున్నాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రోడ్లపై, ఖాళీ స్థలాలు చెత్తా చెదారం లేకుండా చూస్తూ, దోమల నివారణకు పొగమందు కొడుతున్నాం. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నాం. నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి.

– జి.వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ బోడుప్పల్

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నేతలు

ఉప్పల్: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని దాదాపు అన్ని డివిజన్లలో నీటి సమస్య ఉందని, కొన్ని చోట్ల లీకేజీ, మరికొన్ని చోట్ల కలుషిత నీరు సరఫరా కావడం వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని వారు కోరారు. రానున్న వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అందుకు ఎండీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బండారి తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్‌రావు, మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే కురుమల అభివృద్ధి



ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్న ఉప్పల్ కురుమ సంఘం ప్రతినిధులు

ఉప్పల్: కాంగ్రెస్ పార్టీతోనే కురుమల అభివృద్ధి సాధ్యమని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కురుమ సంఘం భవనం అదనపు అంతస్తు నిర్మాణం కోసం రూ.30 లక్షలు మంజూరు చేయించడంతో ఉప్పల్ కురుమ సంఘం నేతలు వారిని అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో చేయూత అందించిన విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, కురుమ సంఘం అధ్యక్షులు గొరిగే ఐలయ్య, జన్ని రఘు, గొరిగే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటాం

మల్లాపూర్: ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొంటామని జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలోని ఇన్‌వార్డ్‌లో సమ్మె నోటీసును అందజేసినట్లు కాప్రా సర్కిల్ బీఆర్‌టీయూ నేత కుర్మన్న తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, కూలీల వ్యతిరేఖ విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాంట్ ఫాం ట్రేడ్ యూనియన్స్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొంటామని పేర్కొన్నారు.

వైన్ షాప్ తొలగించకపోతే ఆందోళనే..



టీవీ కాలనీలో మద్యం దుకాణం

రామంతాపూర్: నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి అంబర్‌పేట్ అలీ కేఫ్‌కు వెళ్లేందుకు రామంతాపూర్ నుంచి నిర్మించిన సర్వీస్ రోడ్డులో ఇరువైపులా విచ్చల విడిగా మద్యం షాపులకు ఇటీవల ఉప్పల్ ఎక్సైజ్ అధికారులు అనుమతులు ఇవ్వడం దారుణమని, వెంటనే రద్దు చేయాలని మంగళవారం ఉప్పల్ మండల ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ కార్యదర్శి పల్లవి డిమాండ్ చేశారు. ఇటీవల రామంతాపూర్‌లోని టీవీ కాలనీలో జనావాసాల మధ్య వైన్‌షాప్‌నకు అనుమతి ఇవ్వడంతో స్థానిక ప్రజలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే షాపులను రద్దు చేయకపోతే ప్రజాసంఘాలు, మహిళా సంఘాలతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధుల కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి



ఎమ్మెల్యేతో సూపరింటెండెంట్ డాక్టర్ సునీత

మల్కాజిగిరి: ప్రజలకు మెరుగైన సేవలందించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ సునీతకు సూచించారు. మంగళవారం ఎమ్మెల్యేను సూపరింటెండెంట్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న వసతుల గురించి ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని, ఆస్పత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆమెకు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంగీత్ ఉన్నారు.

సుభాష్ చంద్రబోస్ పోరాటం వెలకట్టలేనిది



చర్లపల్లిలో నివాళులర్పిస్తున్న స్థానిక నేతలు మన్మోహన్‌రెడ్డి తదితరులు



కాప్రా నేతాజీనగర్‌లో సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు

మల్లాపూర్: స్వాతంత్య్ర సంగ్రామంలో వీరోచితంగా పోరాడిన గొప్ప యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా నాచారంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ పోరాటం వెలకట్టలేనిదని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్‌శేఖర్, పాండురంగం గౌడ్, అభిషేక్ గౌడ్, ప్రేమ్‌కుమార్, సాయిబాబా, భూపాల్‌రెడ్డి, రాగిరి మోహన్‌రెడ్డి, ఎర్రం శ్రీను, రామకృష్ణ, రమణారెడ్డి, ముత్యంరెడ్డి, క్రిష్టయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

నాచారం డివిజన్ కాంగ్రెస్ నేతలు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సునీల్‌రెడ్డి, మున్నీర్, కాంతి కిషోర్, రాకేష్, మోహన్ పాల్గొన్నారు.

చర్లపల్లిలో..

కుషాయిగూడ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం చర్లపల్లిలో ఘనంగ నిర్వహించారు. పెద్ద చర్లపల్లిలోని నేతాజీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మెట్టు మన్మోహన్‌రెడ్డి, గద్దం యాదగిరి, ఆనంద్‌రాజ్‌గౌడ్, మల్లేష్, ప్రేంకుమార్, అభియన్, శివగౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద..

రామంతాపూర్: సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద జ్యోతిరావు పూలే సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు జగదీష్, మహేందర్, పూనమ్, నరసింహ, లక్ష్మణ్, రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి నివాళి

కాప్రా: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్లలో ఘనంగా నిర్వహించారు. కాప్రా నేతాజీనగర్ చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేసీసీసీ అధ్యక్షుడు నాగిరెడ్డి సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సూడుగు మహేందర్ రెడ్డి, నీలంరెడ్డి, మనోహర్‌గౌడ్, శివశంకర్, మురళీగౌడ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రామంతాపూర్‌లో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తూ..



నాచారంలో సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



నేతాజీ సుభాష్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

అటో.. ఇటో.. ఎటో..?



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి విశ్వప్రయత్నం

- గోవా విహారయాత్రకు వెళ్లొచ్చిన మేయర్ టీమ్
- కాంగ్రెస్ పెద్ద నేత రంగంలోకి దిగినట్లు సమాచారం
- కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ఆయనకు టచ్‌లో..
- ఎటూ తేల్చుకోలేక ఆందోళనలో కొంతమంది..
- నగరం వెలుపల క్యాంపులు సాగిస్తున్న మేయర్
- తాయిలాల కోసం తాపత్రయంలో ఎదురుచూపులు

మేడిపల్లి: పీర్జాదిగూడలో అవిశ్వాస తీర్మానం అలజడి మొదలైంది.. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఎలాగైనా మేయర్ పీఠాన్ని హస్తగతం చేసుకోవాలని అధికార కాంగ్రెస్ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పీర్జాదిగూడ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో అధికార కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసం ప్రవేశపెట్టకుండా బీఆర్ఎస్ ఆధీనంలో ఉండేందుకు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇటీవల ప్రయత్నాలు మొదలు పెట్టిన విషయం బహిర్గతమే..

- మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఆధీనంలో ఉన్న సంగతి తెలిసిందే.. అయితే రాష్ట్రంలో ఇటీవల అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టి వాటిని హస్తగతం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.
- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 26 డివిజన్లు ఉండగా మెజార్టీ స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకొని మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ-3, ఇండిపెండెంట్లు-6, బీజేపీ-1 స్థానంలో గెలుపొందగా కొంత కాలానికి అప్పటి అధికార పార్టీ మంత్రి చొరవతో అందరూ బీఆర్ఎస్‌లో చేరారు. కాగా ప్రస్తుతం మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకునేందుకు ఓ పెద్ద నాయకుడు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ప్రయత్నాలను పసిగట్టిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, నగర మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి కార్పొరేటర్లను ఇటీవల గోవా విహారయాత్రకు తీసుకెళ్లి అవిశ్వాస తీర్మానాలకు అవకాశం లేకుండా తన దారికి తెచ్చుకునేందుకు విశ్వ ప్రయత్నం చేసి అందరితో మాట తీసుకున్నట్లు సమాచారం.
- ఓ పెద్ద నాయకుడు తాజాగా రంగ ప్రవేశం చేసి పీర్జాదిగూడ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు స్థానిక కార్పొరేటర్లతో చర్చలు జరినట్లు సమాచారం. ఇప్పటికే మెజార్టీ కార్పొరేటర్లతో చర్చలు జరిపి తమ దారికి తెచ్చుకునేందుకు ఒప్పందం, సంతకాలు సైతం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మెజార్టీ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ఆయనతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం.
- మేయర్ జక్కా వెంకట్ రెడ్డి సైతం కార్పొరేటర్ల సంతకాలు తీసుకుని నగరం వెలుపల క్యాంపులు కొనసాగిస్తూ.. అవిశ్వాస తీర్మాన యత్నాలకు గండి కొట్టేందుకు తన ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా పీర్జాదిగూడ మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టి నెగ్గాలని కాంగ్రెస్ తన సత్తా చాటుకోవాలని చూస్తుండగా, అవిశ్వాసం వీగిపోయేలా బీఆర్ఎస్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి. అయితే అటు మల్లారెడ్డి, ఇటు స్థానిక పెద్ద నాయకుడి మాటలు కాదనలేక మధ్యలో నలిగిపోతున్నట్లు పలువురు కార్పొరేటర్లు అయోమయంలో ఉన్నారు.



వెంకటాపూర్ చౌరస్తాలో ఆంజనేయ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ఆంజనేయుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

అల్వాల్: ఆంజనేయుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. వెంకటాపూర్ చౌరస్తా వద్ద తన సొంత ఖర్చులతో నిర్మించిన 29 ఫీట్ల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, నాయకులు అశోక్ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, నాగేశ్వర్ రావు, సూర్యకిరణ్, ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.